ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 156 | పేజీలు: 5 | వెల: రూ.3/- | శనివారం 14 సెప్టెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## నేటి నుంచి 4 రోజులు హాలిడేస్

హైదరాబాద్, సెప్టెంబరు 13(ప్రభాత ఉదయం) నేటి నుంచి అంటే నుంచి మంగళవారం వరకు వరుసగా ప్రభుత్వ కార్యాలయాలకు, స్కూళ్లకు, కాలేజీలకు సెలవులు రానున్నాయి. రేపు (14) రెండో శనివారం కాగా ఎల్లుండి (15) ఆదివారం. ఇక సోమవారం 16 వ తేదీన ముస్లింల పండుగ మిలాద్ -ఉన్ -నబీ. ఇక 17 మంగళవారం హైదరాబాద్ లో వినాయక నిమజ్జనం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణా వ్యాప్తంగా మొదటి మూడు రోజులూ సెలవు కాగా నాలుగో రోజు వినాయక నిమజ్జనం జరిగే హైదరాబాద్ లో మాత్రమే సెలవు ఉంటుంది. అదేవిధంగా బ్యాంకు ఉద్యోగులకు కూడా మొదటి మూడు రోజుల సెలవు మాత్రమే వర్తిస్తుంది. నిమజ్జనం రోజు బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయి

## నిబంధనలు లేకుండా
# తక్షణ సాయం చేయండి

వరదల వల్ల తీవ్ర నష్టం సంభవించినట్లు వెల్లడి

తెలంగాణ వరద నష్టంపై కేంద్ర బృందంతో చర్చలు

ఇటీవలి వరద నష్టంపై శాశ్వత పరిష్కారానికి వినతి

సచివాలయంలో కేంద్ర బృందంతో సిఎం రేవంత్ చర్చలు



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం): తెలంగాణలో వరదల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కేంద్ర బృందాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో వరద నష్టం అంచనాపై సచివాలయంలో కేంద్ర బృందంతో ఆయన సమావేశమయ్యారు. వరదల నివారణకు శాశ్వత నిధి ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ ఉండాలన్నారు. రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలు లేకుండా తక్షణ సాయం నిధుల విడుదలకు విజ్ఞప్తి చేశారు. మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తెలంగాణలో వరదల వల్ల తీవ్ర నష్టం సంభవించిన దృష్ట్యా ఎలాంటి నిబంధనలు లేకుండా తక్షణ సాయం విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర బృందాన్ని కోరారు. రాష్ట్రంలో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర బృందంతో ఆయన సచివాలయంలో శుక్రవారం భేటీ అయ్యారు. వరదల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. వరదల నివారణకు శాశ్వత నిధి ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ ఉండాలని.. వరద నష్టాన్ని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కాగా, రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు..జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం ఖమ్మం జిల్లాలో పర్యటించింది. ఖమ్మం నగరంతో పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో

..మిగతా 2లో



## తెలంగాణలో శాంతిభద్రతలు కరువు

### ఉద్యమంలోనూ ఇంతటి నిర్బంధం ఎదుర్కోలే

### మీడియాతో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం): పదేళ్లపాటు శాంతి భద్రతల సమస్య రాకుండా బీఆర్ఎస్ పాలన సాగిందని.. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుఅన్నారు. ఉద్యమ సమయంలో కూడా ఇంతటి నిర్బంధం ఎదుర్కోలేదని అన్నారు. హైదరాబాద్‌లోని నివాసంలో శుక్రవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్తోందని.. శాంతిభద్రతలు క్షీణిస్తుండటంపై పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పడానికి సీఎం రేవంత్ రెడ్డి కారణమని విమర్శలు గుప్పించారు. 'శాంతి భద్రతలు అదుపు తప్పడానికి చేసిందంతా చేసి భాగ్యనగరం బ్రాండ్ ఇమేజ్ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి దాడులు చేయించింది ఎవరు ..? రేవంత్ రెడ్డి, డీజీపీలు కాదా ..? నిన్నటి దాడులు ఎందుకు

..మిగతా 2లో

## ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్ జెండర్లు

### నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి.. అధికారులకు సిఎం రేవంత్ సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ సిటీలో రోజు రోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న క్రమంలో క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఇవ్వడం లేదు. ఉదయం, సాయంత్రం సమయాల్లో కాలనీల్లోనూ ట్రాఫిక్ జాం అవుతుంది. వాహనాల సంఖ్య కూడా భారీగా పెరుగు తున్నది. ఈ క్రమంలోనే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గించేందుకు.. వాహనాలు సాఫీగా సాగేందుకు.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త ఆలోచన

..మిగతా 2లో



## పక్కదారి పడుతున్న పాలిటిక్స్

### అరెకపూడి, కౌశిక్‌రెడ్డి మాటల దాడి

### ఇలాంటి వారి వల్ల పార్టీ ఓడిపోయింది: అరెకపూడి గాంధీ



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం): కౌశిక్ వర్సెస్ గాంధీ ఎపిసోడ్.. పీక్స్‌కి చేరింది. అరెకపూడి, కౌశిక్‌రెడ్డి మాటల దాడితో హైదరాబాద్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిన్నటి ఉద్రిక్తతలతో ఈరోజు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు పోలీసులు. ఇరు పార్టీలకు చెందిన నేతలను

..మిగతా 2లో



### ముగింపు దశకు చేరుకున్న
## గణేష్ ఉత్సవాలు

25 వేలమంది పోలీసులతో నిమజ్జన బందోబస్తు

17న నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు

1.30 గంటలకల్లా ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం

అధికారులతో సమీక్షించిన సిపి సివి ఆనంద్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం): నగరంలో గణెశీశ్ నిమజ్జనం సందర్భంగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఖైరతాబాద్ మహాగణపతిని మధ్యాహ్నం 1.30 గంటల్లోపు నిమజ్జనం చేసేలా నిర్వాహకులతో చర్చించామని.. దానికి వాళ్లు అంగీకరించారని తెలిపారు. నగర వ్యాప్తంగా అన్ని రకాల విగ్రహాలు కలిపి సుమారు లక్ష వరకు ఉండొచ్చన్నారు. 17న వేల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్నాయన్నారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున నగరవాసులు హుస్సేన్‌సాగర్ పరిసరాలకు వస్తారని చెప్పారు. దీన్ని దృష్టిలో

..మిగతా 2లో

## రైతును రాజు చేయడం
# ప్రభుత్వం ధ్యేయం

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### అలంపూర్ వ్యవసాయ మార్కెట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం)రైతును రాజు చేయడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అలంపూర్ వ్యవసాయ మార్కెట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలంపూర్ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని అన్నారు. వ్యవసాయపరంగా, విద్యాపరంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నట్లు ఆయన తెలిపారు. తాను గతంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన ఉందని అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సస్యశ్యామలం అయితే తెలంగాణ యావత్తు సస్యశ్యామలం అవుతుందని అన్నారు. కృష్ణ తుంగభద్ర నదుల మధ్యన ఉన్న నడిగడ్డ ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఇప్పటి వరకు రైతుల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఇంకా రెండు లక్షల పైన ఉన్న రైతులకు సాంకేతికంగా పొరపాటు జరిగిన రైతులకు రేషన్ కార్డు లేని రైతులకు ఈ నెలాఖరులోపు రుణమాఫీ చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులలో ఇప్పటి వరకు రెండు లక్షల లోపు

..మిగతా 2లో



### ఎట్టకేలకు ఢిల్లీ సిఎం
## కేజ్రీవాల్‌కు ఊరట

మద్యం కేసులో సుప్రీం బెయిల్ మంజూరు

సిఎంగా విధుల నిర్వహణపై షరతులు విధింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం): ఎట్టకేలకు ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ దక్కింది. సుప్రీం బెయిల్ మంజూరు చేసింది. మద్యం విధానానికి సంబం ధించిన అవకతవకల వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌కు భారీ ఊరట లభించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన తిహార్ జైలు నుంచి బయటకు రానున్నారు. మద్యం విధానానికి సంబంధించిన సీబీఐ కేసులో తన అరెస్టును సవాల్ చేయడంతో పాటు.. బెయిల్ కోసం అభ్యర్థిస్తూ కేజీవ్రాల్ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఇటీవల విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు

..మిగతా 2లో

# శాంతిభద్రతలపై రాజీ ప్రసక్తి లేదు

## ప్రభుత్వాన్ని అస్థిర పరచే కుట్రలో బిఆర్ఎస్ శాంతిభద్రతలపై కఠినంగా ఉండాల్సిందే డిజిపికి సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్13(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తుండడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 3 రోజులుగా ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై స్పందించారు. అధికారం కోల్పోయామనే అక్కసుతో కొందరు కొందరు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఇబ్బంది కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను ఆదేశించారు. రాజకీయ కుట్రలు సహించేది లేదని.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసే పనిలో బీఆర్ఎస్ ఉందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ట్రై కమిషనరేట్లలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని.. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించొద్దని డీజీపీ పోలీసులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీలతో ఆయన సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, తెలంగాణలో పరిస్థితిని చెడగొట్టేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని.. రాష్ట్ర ప్రతిష్టను ఎట్టిపరిస్థితుల్లోనూ కాపాడాలని అన్నారు.



కాగా, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య తలెత్తిన వివాదం క్రమంలో గురువారం నుంచి నగరంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. గురువారం పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై గాంధీ అనుచరులు దాడికి పాల్పడగా.. బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు భారీగా మోహరించారు. బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి పిలుపునిచ్చిన క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు సహా ఇతర నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ కోకాపేటలోని హరీష్ నివాసం వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజలను సైతం ఎవరినీ కలవనీయడం లేదు. హరీష్ రావును కలిసేందుకు వచ్చిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవితను సైతం అడ్డుకున్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'మా ప్రభుత్వం మొదలైనప్పటి నుంచి పడగొడతామని బీఆర్ఎస్, బీజేపీలు పదేపదే చెప్పాయి. అయితే, కేసీఆర్ లక్కీ నెంబర్ మా దగ్గర ఉన్నందున ప్రభుత్వానికేమీ ఢోకా లేదు. ఉప ఎన్నికలొస్తాయని బీఆర్ఎస్ మైండ్ గేమ్ ఆడేందుకు యత్నిస్తోంది. కేసీఆర్ కోసం కొత్త రాజ్యాంగమేమీ ఉండదు. ప్రభుత్వం చేసే మంచి పనుల గురించి మాట్లాడకుండా తొలిరోజు నుంచే ప్రభుత్వం కూలిపోతుందని మాట్లాడుతున్నారు. మేం నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం.' అని రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా రకరకాల కుట్రలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడే విషయంలో సీరియస్‌గా వ్యవహరించాలని డీజీపీకి సూచించారు. తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు పోలీసులు షాక్ ఇచ్చారు. పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్పీ రవి చందన్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.



# నిబంధనలు లేకుండా తక్షణ సాయం చేయండి

మొదటి పేజీ తరువాయి...

రెండు బృందాలుగా వీడి సభ్యులు పర్యటించి నష్టం అంచనా వేశారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి, కాల్వొడ్డు, బొక్కలగడ్డ, ప్రకాష్ నగర్, మోతీ నగర్‌లోని రాజీవ్ గృహకల్పలో ఓ బృందం పర్యటించింది. అటు, రెండో బృందం నగరంలోని దానవాయిగూడెం, తల్లంపాడు – తెల్దారుపల్లి, ఖమ్మం రూరల్ మండలంలోని తనగంపాడు, ప్రకాష్ నగర్‌లో పర్యటించి వరద నష్టాన్ని అంచనా వేసింది. వరద కారణంగా కోతకు గురైన పొలాలు, ఇసుక మేటలు వేసిన పొలాలను కేంద్ర బృందం పరిశీలించింది. వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలకు దాదాపు రూ.5 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతినగా.. దాదాపు దీని నష్టం రూ.2 వేల కోట్లకుపైగానే ఉంటుందని అధికారులు తెలిపారు. వంతెనల ధ్వంసంతో మరో రూ.700 కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు. పంచాయతీ రోడ్లు, మిషన్ భగీరథ పైపులైన్ల పునరుద్ధరణకు దాదాపు రూ.200 కోట్లు అవసరం అవుతాయని అధికారులు లెక్కగడుతున్నారు. వరదల కారణంగా ట్రాన్స్‌కోకు భారీ నష్టం వాటిల్లిందని అన్నారు. అటు, విద్యుత్ స్తంభాలు, సబ్ స్టేషన్ల రిపేర్ల కోసం దాదాపు రూ.150 కోట్లకు పైగానే నిధులు అవసరం అవుతాయన్నారు. అటు, ఏపీ సీఎం చంద్రబాబుతోనూ కేంద్ర బృంద సభ్యులు గురువారం భేటీ అయ్యారు. ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో పర్యటించిన బృంద సభ్యులు వరద నష్టంపై అంచనా వేశారు. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీఎం చంద్రబాబు కేంద్ర బృందాన్ని కోరారు. వరదల వల్ల ప్రాథమికంగా రూ.6,882 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కేంద్రానికి ఇటీవల నివేదిక అందించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

# ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్ జెండర్లు

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నది. హైదరాబాద్ సిటీలో ఫుట్ పాత్ ల అభివృద్ధి, క్లీనింగ్, పరిశుభ్రత, ట్రాఫిక్ అంశాలపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కొన్ని సూచనలు చేశారు. ట్రాఫిక్ స్ట్రీమ్ లైన్ చేయటంలో.. ట్రాన్స్ జెండర్లను వాలంటీర్లుగా ఉపయోగించుకునే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు సూచించారు. హోంగార్డ్స్ తరహాలో వారికి ఉపాధి అవకాశాలను కల్పించే అంశంపై పరిశీలన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ట్రాఫిక్ వాలంటీర్లుగా సేవలు అందించేందుకు ఆసక్తిగా ఉన్న ట్రాన్స్ జెండర్ల వివరాలు సేకరించాలని.. వారి అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు సీఎం రేవంత్ రెడ్డి. ఆర్ అండ్ బీ టెండర్లు పొంది పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దన్నారు సీఎం. ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారాయన. పనులు చేయని కాంట్రాక్టర్లకు సంబంధించి పూర్తిస్థాయి రిపోర్ట్ 15రోజుల్లోగా అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తప్పుడు రిపోర్ట్ లు ఇస్తే అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రైతును రాజు చేయడం ప్రభుత్వం ధ్యేయం

మొదటి పేజీ తరువాయి...

రుణాలను మాఫీ చేయడానికి 31 వేల కోట్లు వెచ్చించామని తెలిపారు. రైతన్నను, నేతన్నను రెండు కళ్ళుగా చూసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేనేత కార్మికులకు 30 కోట్లు మాఫీ చేసిందన్నారు. ఈసారి పంటవేసిన రైతులకే రైతు భరోసా అందిస్తామని మంత్రి తెలిపారు. అకాల వర్షాల వల్ల ఖమ్మం జిల్లాలో అనేక మంది రైతులు నష్టపోయారని రాష్ట్రంలో కూడా రైతులు నష్టపోయిన సమగ్ర నివేదిక తెప్పించి న్యాయం చేస్తామని అన్నారు. రైతులకు పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి ఆదుకుంటుందని మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా గద్వాల సీడ్ ప్రత్తి విత్తనాలకు డిమాండ్ ఉన్నందున ముఖ్యమంత్రితో చర్చించి ఆర్గనైజర్లతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. తుమ్మిళ్ళ ఎత్తిపోతల పథకంలో భాగంగా మల్లమ్మ కుంట రిజర్వాయర్ను త్వరగా నిర్మించేందుకు ముఖ్యమంత్రితో చర్చించి పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఐజ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి కొరకు ప్రత్యేక దృష్టిసారిస్తామని మంత్రి తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేసే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి పరిహారం ఉద్యోగం అందేలా చూస్తామన్నారు. బీచుపల్లి ఆయిల్ మిల్లు ఉత్పాదకకు మిషనరీలు ఇతర ఏర్పాట్లు చేయించి వచ్చే సంవత్సరం వరకు ప్రారంభించి ఇక్కడ నిరుద్యోగాన్ని రూపుమాపుతామని అన్నారు. ఆయిల్ ఫామ్ తోటలు పెంచడం వల్ల ప్రతి రైతుకు ఎకరాకు రూ. 1.50 లక్షల ఆదాయం లభిస్తుందని అన్నారు. రైతులు విరివిగా ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేసి లబ్ధి పొందాలన్నారు. మారుతున్న కాలాన్ని బట్టి రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించి అధిక లాభాలు పొందాలని అన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... పాలమూరు జిల్లా వాసుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పథంలో నడిపిస్తారని తెలిపారు. ప్రజలకు అన్ని విధాల ఆదుకునేందుకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి ఇప్పటికే కొన్ని పథకాలు అమలు చేశామని అన్నారు. అలంపూర్, ఐజ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బింగిదొడ్డి దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్ గౌడ్, డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఆర్డీఓ రామచందర్, మార్కెటింగ్ ప్రాంతీయ ఉపసంచాలకులు ప్రసాదరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌కు ఊరట

మొదటి పేజీ తరువాయి...

వెలువరించింది. రూ.10లక్షల పూచీకత్తు, ఇద్దరు షూరిటీలతో ఈ బెయిల్ మంజూరుచేసింది. కేసు గురించి బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని ఆదేశించింది. ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లొద్దని, అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయొద్దని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ అరెస్టుపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సుదీర్ఘంగా నిర్బంధించడం అంటే.. వ్యక్తి హక్కులను హరించినట్లే. ఈ కేసులో అరెస్టు సరైందే అయినప్పటికీ.. చేసిన సమయం మాత్రం సరిగా లేదు. ఈడీ కేసులో బెయిల్ వచ్చిన వెంటనే సీబీఐ అరెస్టు చేయడం సమంజసం కాదని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రతీ వ్యక్తికి 'బెయిల్ అనేది నిబంధన.. జైలు మినహాయింపు'గా ఉండాలి అని మరోసారి వెల్లడించింది. సీబీఐ పంజరంలో చిలుక కాదని నిరూపించుకోవాలని వ్యాఖ్యానించింది. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ ఏడాది మార్చి 21న ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేయగా.. జైలు నుంచి విడుదలయ్యారు. ఆ గడువు ముగియడంతో జూన్ 2న తిరిగి లొంగిపోయారు. కాగా.. ఈ కేసులో జూన్ 20న రౌస్ అవెన్యూ కోర్టు ఢిల్లీ సీఎంకు సాధారణ బెయిల్ మంజూరు చేసింది. కానీ, దీనిపై ఈడీ అభ్యంతరం వ్యక్తంచేయడంతో మరుసటి రోజే ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. అనంతరం జూన్ 25న బెయిల్‌పై స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో జులైలో ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈడీ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు నుంచి బెయిల్ వచ్చిన వెంటనే సీబీఐ ఆయనను అరెస్టు చేసింది. దీంతో ఈడీ కేసులో ఊరట లభించినప్పటికీ.. ఆయన సీబీఐ జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తిహాడ్ జైల్లో ఉండాల్సి వచ్చింది.





# శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి తుమ్మల

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం)శ్రీ జోగులాంబ అమ్మవారి దయవల్ల రాష్ట్ర ప్రజలు సుఖ: సంతోషాలతో ఉండాలని ప్రార్ధించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన మంత్రికి దేవాలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం సందర్శించి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ జోగులాంబ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు అమ్మవారి ప్రసాదం శేష వస్త్రం బహుకరించి ఆశీస్సులు అందజేశారు.అంతకుముందు మంత్రి హరిత హెూటల్లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ , జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఆర్డీఓ రామచందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పక్కదారి పడుతున్న పాలిటిక్స్

మొదటి పేజీ తరువాయి...

ఎక్కడికక్కడ కట్టడి చేశారు. ముందస్తు హౌజ్ అరెస్టలతో పరిస్థితులను అదుపులోకి తీసుకుచ్చారు. పీఏసీ చైర్మన్ ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావును మాత్రం ఆసుపత్రికి వెళ్లేందుకు అనుమతించారు. తనని పదేపదే రెచ్చగొట్టడం వల్లే అలా మాట్లాడాల్సి వచ్చిందని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. మహిళలను కూడా కించపరిచేలా కౌశిక్‌రెడ్డి మాట్లాడారన్నారు. ప్రాంతీయ వైషమ్యాలతో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని అరెకపూడి విరుచుకుపడ్డారు. ప్రభుత్వాన్ని డిస్టబ్ చేసే పరిస్థితి ఎందుకొచ్చిందో ఆలోచించాలన్నారు. సజావుగా సాగుతున్న పాలనను అల్లకల్లోలం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే బీఆర్ఎస్ ప్రాంతీయ అసమానతలు సృష్టిస్తోందని ఆరోపించారు. సెటిలర్ల పట్ల కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు కరెక్ట్ కాదన్నారు. తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తావా? కౌశిక్‌రెడ్డి రౌడీయిజం చేయడం మంచిది కాదని, తీరు మార్చుకోవాలని గాంధీ సూచించారు. కౌశిక్‌రెడ్డి రెచ్చగొట్టినందుకే అలా మాట్లాడాల్సి వచ్చిందన్నారు గాంధీ. బీఆర్ఎస్ నేతలే దాడి చేశారు. మేము ఒక్కరిపై కూడా దాడి చేయలేదన్నారు. కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్తే రాళ్లు రువ్వారు, పూల కుండీలు విసిరారన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా పదేళ్లుగా సేవలందిస్తున్నానని, ప్రజలను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేదీ లేదన్నారు. కేసీఆర్ అంటే ఎప్పటికీ నాకు గౌరవమే. కేసీఆర్ మమ్మల్ని ఆదరించారు, ఆశీర్వదించారు. కానీ, కౌశిక్‌రెడ్డి వంటి వాళ్లు ఉంటే పార్టీకి చెడ్డపేరు వస్తోందన్నారు గాంధీ. నోటికి అదుపులేని మనిషిని ఊరు మీదకు వదిలేశారు. అలాంటి వారి వల్లే అధికారాన్ని కోల్పోయామన్నారు పీఏసీ ఛైర్మన్ గాంధీ. కౌశిక్‌రెడ్డి వల్ల కేసీఆర్ గొప్ప మనస్తత్వానికి, గతంలో చేసిన సేవలకు చెడ్డపేరు వస్తుందని గాంధీ అన్నారు. అంతకుముందు చెప్పినట్టుగా అరెకపూడి గాంధీ ఇంటికి వెళ్లేందుకు విఫలయత్నం చేశారు కౌశిక్‌రెడ్డి. పోలీసుల కళ్లుగప్పి కొండాపూర్ నివాసం నుంచి బాచుపల్లి వచ్చిన కౌశిక్.. అక్కడి నుంచి గాంధీ ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ, పోలీసులు మాత్రం కౌశిక్‌ను అదుపులోకి తీసుకుని హౌస్ అరెస్ట్ చేశారు. ఇక, అరెకపూడి గాంధీ ఇంటి దగ్గర కూడా ఉదయం నుంచి హైటెన్షన్ కొనసాగింది. బీఆర్ఎస్ నేతలు వస్తే వెల్‌కం అంటూ ఇంట్లో కుర్చీలు వేసి ఉంచారు అరెకపూడి. గాంధీకి మద్దతుగా ఆయన ఇంటికి వచ్చారు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.



# తెలంగాణలో శాంతిభద్రతలు కరువు

మొదటి పేజీ తరువాయి...

ఆపలేదు. అది గాంధీ చేసిన దాడి కాదు రేవంత్ రెడ్డి చేసిన దాడి. మమ్మల్ని ఇవాళ హౌజ్ అరెస్ట్ చేశారు. నిన్న గాంధీని ఎందుకు హౌజ్ అరెస్టు చేయలేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా. ఖమ్మంలో మా మీద దాడి చేస్తే పది రోజులైనా గుండాల మీద కేసులు పెట్టలేదు. నిన్న జరిగిన దాడికి కర్త,కర్మ, క్రియ అంతా రేవంత్ రెడ్డే. ఆయన డైరెక్షన్ లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగింది. ఎమ్జర్గ÷న్సీ కన్నా దారుణంగా రాష్ట్ర పరిస్థితులు తయారయ్యాయి.కోమటి రెడ్డి వెంకటరెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టాలని చెప్పడం దారుణం. ఫిరాయింపులపై ఢిల్లీలో ఒక మాట గల్లీలో ఒక మాట మాట్లాడుతున్నాడు. ఎన్నిక లేకున్నా పీఏసీ చైర్మన్ ను నియమించి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం దుర్మార్గం. డీజీపీ పదవి చాలా ఉన్నతమైంది. ఆదర్శంగా ఉండాల్సిన డీజీపీ.. రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడాలను కుంటున్నారు. రాహుల్ గాంధీ దేశం బయట స్వేచ్ఛ స్వాతంత్ర్యాల గురించి పాఠాలు చెప్పడం కాదు. తెలంగాణలో ఏం జరుగుతుందో చూడాలన్నారు. ÷ూజ్యాంగ హక్కులను ఉల్లంఘించి పార్టీ ఫిరాయింపులు జరిగాయి. పీఏసీ చైర్మన్ నియామకం కూడా అలాగే జరిగింది. మీరు మాపై విసిరే రాళ్లే అధికారంలోకి బీఆర్ఎస్ రావడానికి పునాది రాళ్లు. 16వ ఆర్థిక సంఘం గురించి మీరు తప్పుడు లెక్కలు చెబితే, మేము బాధ్యతాయుతంగా బలమైన వాదనను వినిపించాం. ఆంధ్రా నాయకుల మీద రేవంత్ రెడ్డి కపట ప్రేమ వలకబోస్తున్నారు. చిన్న జీయర్ స్వామిని, యాదాద్రి నిర్మాణానికి ప్లాన్ ఇచ్చిన ఆనంద సాయిని ఆంధ్రోడు అని రేవంత్ అన్నారు. మరి దానికి ఏమని సమాధానం చెబుతారు. పీఏసీ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదం. ఎలక్షన్ కాదు, సెలక్షన్ ద్వారా ఇది జరిగింది. కరీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో నీ పెత్తనం ఏంటని అరికెపూడి గాంధీ.. కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. దానికి సమాధానంగానే కౌశిక్ రెడ్డి మాట్లాడారు తప్పా? సెటిలర్ల మీద కౌశిక్ కామెంట్ చేయలేదు. ముందు రెచ్చగొట్టింది గాంధీ. ఆయనకు చెప్పిన సమాధానం అది'అని హరీశ్ రావు తెలిపారు. గురువారం జరిగిన తొక్కిసలాటతో తనకు భుజం నొప్పి మొదలైందని.. డాక్టర్లు ఎమ్మారై స్కాన్ తీసి 15 రోజుల పాటు ఫిజియోథెరపీ సూచించారని హరీశ్ వివరించారు.

# ముగింపు దశకు చేరుకున్న గణేష్ ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి...

ఉంచుకుని బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని సీపీ వివరించారు. ఇకపోతే గణెశిష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయాక విగ్రహాలు నిమజ్జనాలు జరుగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గణెశిష్ నిమజ్జనం ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... గణెశిష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో గణెశిష్ నిమజ్జనం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణెశిష్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. నాలుగు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 17న వేల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం అవుతాయని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. గణెశిష్ నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు శుక్రవారం కీలక నిబంధనలు ప్రకటించారు. నిమజ్జనం రోజున పాటించాల్సిన ముందస్తు నియమాలను వెల్లడించారు. గణెశిష్ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకెళ్లడానికి అవసరమైన వాహనాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున సౌత్ జోన్ పరిధుల నుంచి విగ్రహాలను తీసుకెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని, వాహనానికి ఏసీపీ కేటాయించిన నంబర్‌ను ప్రదర్శించాలని తెలిపారు. ఇకపోతే ఒక గణెశిష్ విగ్రహానికి ఒక వాహనం మాత్రమే అనుమతి ఉంటుంది.విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై లౌడ్ స్పీకర్‌ను అమర్చకూడదు. నిమజ్జనం రోజు వాహనాలపై డీజేతో కూడిన మ్యూజికల్ సిస్టమ్‌కు అనుమతి లేదు. రంగులు చల్లుకునేందుకు కాన్ఫెట్టి తుపాకులను ఉపయోగించకూడదు. విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంలో మద్యం లేదా మరేదైనా మత్తుమందులు సేవించిన వ్యక్తులకు అనుమతి ఉండదు.

రోడ్డుపై వాహనం వెళ్లేటప్పుడు ట్రాఫిక్‌ను ప్రభావితం చేయకూడదు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకూడదు విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ఇతర వాహనాలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఏదైనా ప్రార్థనా స్థలం దగ్గర లేదా మార్గంలో ఆపకూడదు. అప్పటి పరిస్థితులను బట్టి పోలీసు అధికారులు ఇచ్చే ఆదేశాల మేరకు వాహనాల కదలికలు ఆధారపడి ఉంటాయి.ఊరేగింపులో ఎవరూ కర్రలు/కత్తులు, కాల్పులు ఆయుధాలు, మండే పదార్థాలు లేదా ఇతర ఆయుధాలను తీసుకెళ్లకూడదు. జెండాలు లేదా అలంకారాల కోసం ఉపయోగించే కర్రలు 2 అడుగుల కంటే ఎక్కువ పొడవు ఉండకూడదు. వెర్మిలియన్, కుంకుమ లేదా గులాల్‌లను బాటసారులపై వేయకూడదు. ఊరేగింపులో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు/రెచ్చగొట్టే ప్రసంగాలు/నినాదాలు లేదా రెచ్చగొట్టే సంకేతాలు లేదా బ్యానర్లు ఉపయోగించకూడదు. జనాలలో ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే ఇతర రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.

# సందర్శకులకు ఆహ్లాదం పంచుతున్న గండిపేట్ చెరువు, పార్కు



గండిపేట్ చెరువు వద్ద ఉన్న గార్డెన్ లో సెల్ఫీ తీసుకుంటున్న సందర్శకులు..



గార్డెన్‌కు సమీపంగా గండిపేట్ చెరువు..



గండిపేట్ పార్కులో సందర్శకులు

రాజేంద్రనగర్, సెప్టెంబర్13(ప్రభాత ఉదయం) : గండిపేట చెరువు. దీనినే ఉస్మాన్ సాగర్ అని కూడా పిలుస్తారు. 1920 వ సంవత్సరంలో చివరి నిజామైన ఉస్మాన్ అలీ ఖాన్ ఈ చెరువును నిర్మించాడు. హైదరాబాద్ నగర ప్రజలకు దాహార్తిని తీర్చడానికి, గండిపేట్ చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలకు వ్యవసాయానికి నీరు అందించడానికి అప్పట్లో ఈ చెరువును నిర్మించారు. వికారాబాద్ కొండల్లో నుంచి ఉస్మాన్ సాగర్ కు కాలువల ద్వారా నీరు వచ్చి చేరుతుంది. ఈ చెరువు కెపాసిటీ 29.6 మిలియన్ క్యూబిక్ మీటర్లుగా ఉంది.

**ఆహ్లాద పరుస్తున్న పార్కు :**

1920 లో నిర్మించిన గండిపేట్ జలాశయానికి 2020 నాటికి 100 సంవత్సరాలు పూర్తయింది. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గండిపేట్ జలాశయాన్ని అనుకొని అందమైన, సుందరమైన, ఆహ్లాదాన్ని పంచే పార్కు ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రకరకాల చెట్లు, అందమైన ల్యాండ్ స్కేపింగ్, చెరువుని ఆనుకొని ఉన్న ఈ పార్కు సందర్శకులను కనువిందు చేస్తుంది. పార్కు లో కూర్చోవడానికి కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

**చెరువు అలలతో చల్లని గాలులు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి**

వికారాబాద్ అడవులు, కొండలు, కోనల్లో నుంచి అనేక వనమూలికలను దాటుకుంటూ గండిపేట్ జలాశయంలోకి వరద నీరు చేరుతుంది. పార్కు పక్కన నిల్చుని ఆ అలల గాలులను ఆస్వాదిస్తుంటే స్వచ్ఛమైన ఆక్సిజన్ తో పాటు మనసు ప్రశాంతతను పొందుకుంటుంది. ఈ చెరువు పరిసరాలు ఆరోగ్యాన్ని పంచేవిగా ఉన్నాయి.

**రూ.50 లకే ప్రవేశం :**

గండిపేట్ జలాశయాన్ని, పార్కును తిలకించడానికి రూ. 50 లు వసూలు చేస్తున్నారు. పార్కు ను చూశాక ఇది చాలా తక్కువ అని అనిపిస్తుంది.

**క్యాంటీన్ ఏర్పాటు చేయాలి :**

గండిపేట్ చెరువును, పార్కును తిలకించడానికి వచ్చే సందర్శకులు, పర్యాటకుల కోసం ఒక క్యాంటీన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సందర్శకులు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. పార్కులో ఎలాంటి క్యాంటీన్ లేకపోవడంతో సందర్శకులు కొంత ఇబ్బందులకు గురవుతున్నారు.



గండిపేట్ చెరువు వద్ద...



సీతారాం ఏచూరీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

## సీతారాం ఏచూరి మరణంతో అణగారిన వర్గాలకు తీరని లోటు

బుద్వేల్, సెప్టెంబర్13(ప్రభాత ఉదయం): ప్రపంచ మేధావి, మార్కిస్టు పార్టీ సిద్ధాంత కర్త, సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి, అణగారిన వర్గాలకు తీరని లోటని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్ అన్నారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె. రుద్ర కుమార్ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరీ మరణానికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ కాకినాడ ప్రాంతానికి చెందిన సీతారాం ఏచూరీ ఉన్నత చదువుల కోసం ఢిల్లీ వెళ్లి విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, వామపక్ష పార్టీల పట్ల ఆకర్షితులై అంచలంచెలుగా జాతీయ నాయకునిగా ఎదిగారన్నారు. ఆయన మరణం పీడిత వర్గాల కు తీరని లోటు అన్నారు. నిరంతరం పీడిత వర్గాల కోసం సీతారాం ఏచూరి పరితపించే వాడన్నారు. నివాళులు అర్పించిన వారిలో సీఐటీయూ నాయకులు పెంటయ్య, ఎన్. జంగయ్య భాస్కర్, రవికుమార్, తదితరులున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) వ్యవసాయ విశ్వవిద్యాలయం 11 కెవి విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ, బెస్ట్ ప్రైస్, కాందారి హిల్స్, శ్రీదేవి కాలనీ లలో చింతల్ మెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:00 నుండి 11:30 వరకు వాదేహి సులేమాన్ నగర్, అక్బర్ హిల్స్, బాసిద్ బాబా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు బసిద్ బాబా నగర్ ,అక్బర్ హిల్స్ ,చింతల్ మెట్, ఇక్బాల్ ఫంక్షన్ హాల్ లలో, పహడి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఒకటిన్నర వరకు సులేమాన్ నగర్ చింతల్ మెట్ పహడి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతర్యామి ఉంటుందని శివరాంపల్లి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ్ చారి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సరఫరా అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**హిమాయత్ సాగర్ సెక్షన్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల సన్ సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు హిమాయత్ సాగర్, వెస్ట్ ఎండ్ కాలనీ, గందం గూడ, శాంతినగర్, లక్ష్మీ నగర్, హైదర్ షాకోట్ లలో, హైదర్ షా కొట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 11:30 నుండి 12 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రస్థా కాలనీ, తిరుమల గార్డెన్, రాధా రీట్ పి ఆర్ ఎస్ %జూష్ట్రుంవ%-2, పవన్ హార్మోని విల్లాస్, బచ్ పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ కొంత ప్రాంతం, మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు మిలిటరీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మ్యాప్లే టౌన్, విశ్వాస నగర్, స్పెషల్ బ్లాక్, బి బ్లాక్, సన్ సిటీ ప్రధాన గేట్, మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు ఖాళీ మందిర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోగల ప్రాంతాలైన శివ సాయి నగర్ ఫేస్ వన్, పేస్ -2, బైరాగి గూడ, శివపురి, సంజయ్ గాంధీనగర్, సంఘం సిటీ, భవాని నగర్ కాలనీ, ఇండస్ వ్యాలీ ప్రాంతాలలో, సాయిరాం నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు సాయిరాం నగర్ కాలనీ, సాయిరాం ఎంక్లేవ్, సాయి హర్ష కాలనీ, సౌభాగ్యనగర్ కాలనీ, పి అండ్ టి కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు పి అండ్ టి కాలనీ ఏ బి సి డి , స్పెషల్ బ్లాక్స్, సన్ సిటీ లలో, స్నేహిత హిల్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పీరం చెరువు విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 11 నుండి 12:30 వరకు పీరం చెరువు గ్రామం, ఎంపైర్ ఇన్ సిగ్నయ్, వసతి ఆనంది, గిరిదారి అపార్ట్మెంట్, షాదన్ ఇన్స్టిట్యూషన్స్, భాగ్యనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీ హిల్స్, భాగ్యనగర్ కాలనీ, రాధానగర్, కేకే-3, రాధా నగర్ ఫేస్ 1, హీరా కాలనీ, ఇంద్రారెడ్డి కాలనీ పరిధిలలో వివిధ మరమ్మత్తుల నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ లో...**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో పహల్ ఫుడ్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ పరిశ్రామికవాడ, మధుబన్ వాటర్ ట్యాంక్ ప్రాంతం లలో, శివాజీ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు జల్పల్లి పారిశ్రామిక వాడ, శివాజీ నగర్ పారిశ్రామికవాడ, శివాజీ నగర్ ప్రాంతం లలో వివిధ మరమ్మత్ ల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్ తెలిపారు.

**శంషాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో...**

శంషాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు మధురా నగర్, శ్రీనివాస కాలనీ, ఆదర్శనగర్, 9 గంటల నుండి 10 గంటల వరకు శంషాబాద్, కోత్వాలు కూడా విద్యుత్ ఫీడర్ పరిధిలో శంషాబాద్,హుడాకాలని, సిద్ధాంతి, ఆర్.బి నగర్, కోత్వాలు గూడ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాష తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరానికి సహకరించాలని ఆయన కోరారు.

**ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో...**

ఇబ్రహీం భాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో అల్కాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి రెండు గంటల వరకు క్యూ క్యూ కాలనీ, స్కైలా, పెంటయ్య నగర్, కే ఎన్ ఆర్ హిల్స్, డైమండ్ హిల్స్, వినాయక నగర్ ఫేస్-2, అల్కాపూర్ న్యూ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి రెండు గంటల వరకు అల్కాపూర్ రోడ్డు నెంబర్ 14 నుండి 22 వరకు, తుల్జారాం విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి మూడు గంటల వరకు అల్కాపూర్ రోడ్డు నెంబర్ 22 నుంచి 30 వరకు, ఫ్రెండ్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుండి 11:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



ముస్లిమ్ సోదరులనుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

## మిలాద్ ఉన్ నబీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్**

బుద్వేల్, సెప్టెంబర్13(ప్రభాత ఉదయం): మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం మత పెద్దలు, నాయకులతో శుక్రవారం రాజేంద్రనగర్ డీసీపీ, పోలీస్ అధికారులు సమావేశమయ్యారు. పీడీపీ చౌరస్తా లోని ఐ బి ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ సమావేశానికి రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయకుమార్, ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ వెంకటరామిరెడ్డి, మజ్లీస్ పార్టీ నాయకులు మత పెద్దలు పాల్గొన్నారు. ఈనెల 16న తమ ప్రాంతాలలో ప్రశాంతంగా మిలాద్ ఉన్ నబి పండుగను జరుపుకోవాలన్నారు. ఈనెల 19న మిలాద్ ఉన్ నబి ర్యాలీని చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ర్యాలీని ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మజ్లీస్ నాయకులు నవాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు



రాజేంద్రనగర్ లో సభ్యత్వ నమోదు కార్యక్రమం లో పాల్గొన్న బీజేపీ నాయకులు

## రాజేంద్రనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

బుద్వేల్, సెప్టెంబర్13 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు జి బాబు రావు ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్ శాంతినగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమరాజ్ హాజరయ్యారు. డివిజన్ లో 20వేల సభ్యత్వాలు చేయడమే లక్ష్యం గా పని చేయాలనన్నారు. రంగారెడ్డి జిల్లా సభ్యత్వ ఇంచార్జి మొండ్రా కొమురయ్య , జిల్లా జనరల్ సెక్రెటరీ వై శ్రీధర్, మక్తల్ అసెంబ్లీ ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి , మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా దామోదర్ రెడ్డి, డి సత్యనారాయణ ముదిరాజ్, కోరని సదానందం, పీ సందీప్ ముదిరాజ్, హరికిషన్ జీ, కోరని క్రాంతి, సులిగె విఠల్, కీర్తి శ్రీనివాస్, జి పద్మావతి , ఆర్.పవన్ రాజ్, మల్లేష్ చారి, రాపర్తి రాకేష్ గౌడ్, రమేష్, రాఘవేంద్రచారి, శశి , వంశీ, తదితరులు పాల్గొన్నారు.





## రాజేంద్రనగర్‌లో బిఆర్ఎస్ పటిష్టమైన నాయకత్వాన్ని తయారు చేద్దాం: మాజీ మంత్రి సబితా రెడ్డి

**కాంగ్రెస్ రాష్ట్రంలో రౌడీ రాజ్యం ఏలుతోంది: బిఆర్ఎస్ యువ నేత కార్తీక్ రెడ్డి**

**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడి అమానుషం: బి ఆర్ ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు అప్పారెడ్డి ముఖేష్**

రాజేంద్రనగర్, సెప్టెంబర్ (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ లో బి ఆర్ ఎస్ కు పటిష్టమైన నాయకత్వాన్ని తయారు చేద్దామని మాజీ మంత్రి, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యురాలు పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఉందనిరాజ్యాంగ విరుద్ధంగా ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్ళటం సరైనది కాదని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించడంతో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దాడికి పాల్పడటం అమానుషమని అన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల మాజీ మంత్రి సబితా రెడ్డి, బీ ఆర్ ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి లను తన అనుచరులతో కలిసి బి ఆర్ ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఖేష్ కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా యువనేత కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు, పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కల్లబొల్లి మాటల తో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆర్గ్గారంటీలను అమలు చేయకుండా ఉండడంతో పాటు, బిఆర్ఎస్ నుంచి విజయం సాధించిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయటం ప్రశ్నించినందుకు వాళ్ళ పై దాడి పాల్పడ్డారని ఆరోపించారు. మాజీ మంత్రి సబితా రెడ్డి నాయకత్వంలో రాజేంద్రనగర్ లో టిఆర్ఎస్ పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. బి ఆర్ ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఖేష్ మాట్లాడుతూ... మాజీ మంత్రి సబితా రెడ్డి, యువనేత కార్తీక్ రెడ్డి నాయకత్వంలో రాజేంద్రనగర్ లో బి ఆర్ ఎస్ ను మరింత బలోపేతం చేస్తామన్నారు.అత్తాపూర్ డివిజన్ టిఆర్ఎస్ నాయకత్వాన్ని ఇవ్వాలని తాను కార్తీక్ రెడ్డిని కోరానని ముకేశ్ తెలిపారు. సబితా రెడ్డి, కార్తీక్ రెడ్డిలను కలిసిన వారిలో స్థానిక నాయకులు ఉన్నారు.



సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానిక నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

## కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి దేశానికి, ప్రజలకు తీరని లోటు: సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జిఎం కురుమయ్య

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మార్సిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి దేశానికి, ప్రజలకు తీరని లోటని రాజేంద్రనగర్ మండల సిపిఎం కార్యదర్శి జి కురుమయ్య అన్నారు. శుక్రవారం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సందర్భంగా రాజేంద్రనగర్ మండలం పార్టీ కమిటీ నాయకత్వం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జిఎం కురుమయ్య మాట్లాడుతూ ... కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐ నాయకుడిగా జేఎన్ఎయూ యూనివర్సిటీలో జరిగిన ఎన్నికల్లో సుమారు మూడు పర్యాయాలు గెలిచారన్నారు. పార్లమెంట్ , రాజ్యసభ సభ్యుడుగా పనిచేయడంతో పాటు సిపిఎం పార్టీ నాయకుడిగా అంచలంచెలుగా ఎదిగి భారతదేశ ప్రధాన కార్యదర్శిగా ప్రజల కోసం పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందడం తీరని లోటని అన్నారు. ఈ సమావేశంలో మండల సిపిఎం కమిటీ సభ్యులు ఎన్ జంగయ్య, పార్టీ నాయకులు ఎం బాలస్వామి, వెంకటస్వామి, చెన్నయ్య నర్మదా తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించండి

**టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్**



సిఎండి ముషారఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజనీర్ రత్నాకర్ రావు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం) విద్యుత్ సేవల్లో అంతరాయం లేకుండా బాధ్యతగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని టిజిఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ సూచించారు. శుక్రవారం రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి లో గల విద్యుత్ డి ఈ కార్యాలయాన్ని సిజిఎం ఆనంద్, రాజేంద్రనగర్ ఎస్ ఈ శ్రీరామ్ రామ్మోహన్ లతో కలిసి సందర్శించి డివిజన్లో ఉన్న పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సి ఎం డి ముషారఫ్ మాట్లాడుతూ...విద్యుత్తు వినియోగ దారులకు ప్రభుత్వం అందించాలని ముందుకు వెళుతుందని ప్రభుత్వ లక్ష్యాలను బాధ్యతాయుతంగా అందించాల్సిన అవసరం అన్నారు. కొత్త సర్వీసులను సత్వరమే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజనీర్ రత్నాకర్ రావు, ఏ డి ఈ లు ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## హైదర్ గూడ బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ వినాయక మండపంలో అన్నదానం

బుద్వేల్, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) : హైదర్ గూడ బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ లో ప్రతిష్టించిన వినాయక మండపం నిర్వాహకులు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయకుని దర్శించుకోవడానికి వచ్చిన రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి, రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో , టీ టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతి మ్యాదం రామేశ్వరరావు లను సన్మానించారు.



బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన వినాయకుని దర్శించుకుంటున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ వెంకట్రామిరెడ్డి ని సన్మానిస్తున్న నిర్వాహకులు



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి కి సన్మానం చేస్తున్న శ్రీకాంత్



టీడీపీ నాయకులు మ్యాదం రామేశ్వర్ రావు కు సన్మానం



రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో లకు సన్మానం

# కరడు గట్టిన సైబర్ నేరస్థుడు ముడావత్ కిషన్ ఏ కృష్ణ అరెస్ట్

### సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డి.ఎస్.పి



కొత్తకోట, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) గత మూడు, నాలుగు సంవత్సరాలగా రెండు రాష్ట్రాలకు సంబందించిన అమాయక ప్రజలను ఇండియా బుల్స్ , ధని , ముద్ర లోన్స్ పేరు మీద సైబర్ క్రైమ్ ద్వారా దోచుకుంటున్న కరడు కట్టిన నేరస్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. డి.ఎస్.పి రత్నం తెలిపిన వివరాల ప్రకారం... ప్రధాన సూత్రదారి అయిన నర్సింగ్ నాయక్, కురుమూర్తి , రాతలవత్ రమేశ్, ఇస్లావాత్ రాములు ఏ బాబు , కొత్తపల్లి ఉమేశ్, బోయ వీరేష్, ఇద్దరు మైనర్లు ఎనిమిది మందిని పెద్దమందడి మండలం అరెస్ట్ చేసి జైలుకు పంపారు . పామిరెడ్డిపల్లి తండా కు చెందిన ముడావత్ రమేశ్ పై కేసు నమోదు చేసి విచారించగా శుక్రవారం పామిరెడ్డిపల్లి తండాకు చెందిన మరొక నేరస్తుడు ముడావత్ కిషన్ ఏ కృష్ణ పట్టుకొని విచారించగా అతను మేస్త్రి పనుల గురించి గల్ఫ్ దేశాలైన ఖతార్, సౌదీ అరేబియాకు వెళ్ళి 2006 నుండి 2012 వరకు పనిచేసినాడు. తరువాత 2013 సంవత్సరములో ఇండియాకు తిరిగి వచ్చి మామిడిమాద తండాకు చెందిన సునీతను వివాహం చేసుకున్నాడు. పెళ్లి తరువాత మళ్ళీ గల్ఫ్ దేశాలకు వెళ్ళి అక్కడ 2020 వరకు ఉన్నాడు. ఇండియా కు తిరిగి వచ్చిన తరువాత హైదరాబాద్ లో ఆటో నడిపినాడు. అప్పుడు తన చిన్న తమ్ముడైన రాకేశ్ ద్వారా అతని స్నేహితుడు వడుత్యావత్ రమేశ్ ఏ లడ్డు రమేశ్ , వడుత్యావత్ రమేశ్ ఏ చెట్కి రమేశ్ వ్యక్తి ద్వారా సైబర్ నేరాలు చేస్తున్నారని తెలుసుకున్నాడు. తరువాత బీహార్ రాష్ట్రం లోని పాట్నా కు వెళ్ళి అక్కడ వడుత్యావత్ రమేశ్ ఏ లడ్డు రమేశ్, వడుత్యావత్ రమేశ్ ఏ చెట్కి రమేశ్, హరీష్ , నరేశ్ ల సహకారముతో సైబర్ నేరాలు ఎలా చేయాలో నేర్చుకున్నాడు. అక్కడే కొన్ని నెలల పాటు సైబర్ నేరాలకు పాల్పడి డబ్బులు సంపాదించిన తరువాత వనపర్తికి వచ్చి గత రెండు ఏళ్లుగా ముద్ర , ఇండియా బుల్స్ / ధని అనే లోన్ ఆప్స్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడి అమాయక ప్రజలను మోసం చేసి వచ్చిన దాదాపుగా ఒక కోటి రూపాయల డబ్బుతో వనపర్తి లో రెండు ఇంటి ప్లాట్లు కొనుగోలు చేశాడు. తన తండా లో ఆదునిక వసతులతో దాదాపు 65 లక్షలతో రెండు అంతస్తుల ఇల్లు నిర్మించుకున్నాడు. 7 నెలల క్రితం మారుతి సుజుకి బ్రీజా కార్ ఖరీదు చేశాడు. సైబర్ నేరాలలో ఆరితేరిన తరువాత తన తండా వాసులకు కూడ శిక్షణ ఇచ్చారు. ఇతను తన ఆర్థిక నేరాలకు తెలుగు రాష్ట్రాల్లో అమాయక ప్రజలను టార్గెట్ గా ఎంచుకున్నాడు. ఇతని ద్వారా శిక్షణ పొందినవారు పాట్నా, ఢిల్లీ, కలకత్తా , వనపర్తి లో కూడ ఆఫీసులు ప్రారంభించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఇతని వద్ద ఇంటి ప్లాట్లకు సంభందించిన డాక్యుమెంట్లు, మారుతి సుజుకి బ్రీజా కార్,వివిధ బ్యాంకులకు చెందిన అకౌంటు బుక్కులు, పాస్ పోర్ట్ ,మూడు మొబైలు ఫోన్లు, రెండు కి ప్యాడులను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్ గురించి ఆత్మకూర్ కోర్ట్ లో హాజరు పరిచారు. ఈ కేసు విచారణను తెలంగాణ సైబర్ సెక్యూరిటి బ్యూరో డైరెక్టర్ షికా గోయల్, డి జి పి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా %ూా% గిరిధర్ అధ్వర్యంలో వనపర్తి డి.ఎస్.పి పర్యవేక్షణలో కొత్తకోట ఎస్ ఐ మంజునాథ్ రెడ్డి , శ్రీ రంగాపూర్ ఎస్ ఐ వెంకటేశ్వర్లు , జిల్లా పోలీసు సిబ్బంది సహకారంతో జిల్లా సైబర్ సెక్యూరిటి ఇంచార్జి డి.ఎస్.పి. రత్నం , కొత్తకోట సి ఐ రాంబాబు కేసును దర్యాప్తు చేస్తున్నారు.




## తక్కువ భూమి విస్తీర్ణం ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగు చేస్తే ఉపాధి

### అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య
### ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో ఎస్సీ ఉపప్రణాళిక కింద రైతులకు కూరగాయ విత్తనాలు, సేంద్రియ ఎరువులు, ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ పంపిణీ

పెద్దమందడి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) పెద్దమందడి మండలంలోని మోజర్ల లో గల ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక కింద 75 మంది షెడ్యూల్ కులాల రైతులకి మిరప, బెండ, వంగ కూరగాయల విత్తనాలు, సేంద్రియ ఎరువులు, సేంద్రియ పురుగుమందులు, ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య మాట్లాడుతూ.... తక్కువ భూమి విస్తీర్ణం ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగు చేస్తే ఉపాధి సంవత్సరమంతా దొరకడంతో పాటు పెట్టిన పెట్టుబడికి వెంటనే రాబడి వస్తుందని పేర్కొన్నారు. ఉద్యాన పంటలు సాగుతో నష్టాలు చాలా తక్కువ అని చెప్పారు. రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల డిమాండ్తో భవిష్యత్తులో సైతం కూరగాయలకు మంచి ధర ఉంటుందని ఆయన తెలిపారు. హైదరాబాదులో నేటికీ కేవలం 60% కూరగాయలు మాత్రమే స్థానికంగా ఉత్పత్తి అవుతున్నాయని, హైదరాబాద్ చుట్టుపక్కల 100 కిలోమీటర్ల పరిధిలో కూరగాయలు పండించుకునేందుకు వీలుందని, తద్వారా రైతులు గిట్టుబాటు ధర పొందవచ్చని డాక్టర్ సైదయ్య తెలిపారు. విత్తనాలు విత్తనాలు ఇతర ఇన్పుట్స్ తీసుకున్నారు రైతులు సలహాలు సందేహాలను అభివృద్ధి చేసుకునేందుకు కళాశాల శాస్త్రవేత్తలను ఎప్పుడైనా సంప్రదించవచ్చని తెలిపారు. ఉద్యాన రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉంటామని ్ల ర్కొన్నారు. రైతులకు 8200 విలువైన ఇన్పుట్ లు సరఫరా చేసినట్లు ఎస్సీ సబ్ ప్లాన్ ఇంచార్జ్ బేబీ రాణి చెప్పారు. కార్యక్రమంలో జీవన ఎరువులు, సేంద్రియ పురుగుమందులపై డాక్టర్ షహనాజ్, కూరగాయల నర్సరీ పై డాక్టర్ శ్రీనివాస్ , ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ పై చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో కని మెట్ట, చిన్న మందడి, మోజెర్ల, మద్దిగట్ల, జయన్న తిరుమలాపూర్ షెడ్యూల్ కులాల రైతులు పాల్గొన్నారు.





## తెలంగాణను నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్న సీఎం రేవంత్

### మాజీ మంత్రి హరీష్ రావు
### బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎప్పుడైనా దాడులు జరిగాయా.!
### రేవంత్ పాలలో ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉంది:రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) సీఎం రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడులు చేయిస్తున్నారని,అక్రమంగా నిర్బంధిస్తున్నారని విమర్శించారు.కోకాపేటలోని మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇంటికి వెళ్లి పోరెడ్డి ధర్మారెడ్డి బృందం పరామర్శించారు.ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ...గురువారం డిసిపి ఆఫీసులో పోలీసులు కొందరు కావాలనే హరీశ్‌రావును గాయపరిచారని తెలిపారు.చేయి నొప్పి పెడుతున్నదని అరిచినా..కనీసం కనికరం లేకుండా పోలీసులు ఇష్టానుసారంగా వివరించడం వల్లనే ఆ నొప్పి మరింత పెరిగిందన్నారు.దాడుల సంస్కృతిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానిస్తుందా అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎప్పుడైనా దాడులు జరిగాయా అని నిలదీశారు..ఆయన విధ్వంసకర పరిపాలన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నదని ఫైర్ అయ్యారు.శాంతి భద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ విఫలమైందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వము అన్ని వ్యవస్థలను విధ్వంసం చేస్తున్నారని పోరెడ్డి ధర్మారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధిస్తున్నారని చెప్పారు.ప్రభుత్వం మౌనంగా ఉండటం దేనికి సంకేతమని విమర్శించారు.సరైన సమయంలో ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. ప్రతిపక్షాలను అనచివేయాలని చూస్తున్నారని చెప్పారు.తెలంగాణ ఉద్యమంలో కూడా ఈ రకమైన నిర్బంధాలు, అణిచివేతలు చూడలేదు. కాంగ్రెస్ పాలలో ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## అహంభావంతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలి

### హైదరాబాద్ అభివృద్ధి అందరి సహకారంతోనే సాధ్యం అయింది..
### తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం) ప్రాంతీయ భేదాలు తీసుకువచ్చి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని దెబ్బతీసే కుట్ర చేస్తున్న ఎమ్మెల్యేలు, దయచేసి ప్రజా సమస్యలపై పోరాడండి కానీ ఇలా చిల్లర రాజకీయాలు చేయవద్దని తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వం చేసిన 7లక్షల కోట్ల అప్పును తీరుస్తునే, రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వనికి సహరించాలి కానీ, సొంత ఇమేజ్ పెంచుకోవడానికి ఇలాంటి కించపరిచే మాటలు మాట్లాడం చాలా సిగ్గు చేటు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏనాడు ఇలాంటి సంఘటలను చూడలేదు అని, బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఉన్న శాంతి భద్రతల గురించి ఎప్పుడైనా మాట్లాడారా అని అడిగారు. ప్రాంతీయ భేదాలు తీసుకువచ్చి ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడడం సబబు కాదని, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. అందరి సహకారంతోనే ఈరోజు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని సొంతం చేసుకుందని, మహిళలను అవమానిస్తూ, సంఘ విద్రోహ శక్తిగా మారుతున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తక్షణమే రాష్ట్ర ప్రజలకు, మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీని రెండు దఫాలు గెలిపిస్తే, తెలంగాణ ప్రజలను ఆగం చేసి, దోచుకు తిన్నారు. మీ అహంకారాన్ని అణచివేయడానికి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. అధికారం పోతే ఇంత దిగజరిపోవాలా, మీ ఓటమిని అంగీకరించకుండా ఇంకెన్నాళ్ళు ఈ నాటకాలు, ఇకనైనా ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించి ప్రజలు ఏర్పరుచుకున్న ప్రజా ప్రభుత్వం పై బురద జల్లడం మానేసి, మీరు చేసిన తప్పులకి ప్రాయశ్చిత్తం చేసుకోండి అని తెలిపారు. ఏమేం తప్పులు చేశారో తెలుసుకుని సరిదిద్దుకోవాలి కానీ..మీ తప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి, మిమ్మల్ని మీరు సమర్థించుకోవడానికి ఇలాంటి కారణాలు చెప్పి దుష్ప్రచారం చేయడం నిజంగా హాస్యాస్పదం అని అన్నారు.



## స్కూల్ బస్సును ఢీకొన్న కారు

### కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు

కొత్తకోట, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మదర్ తెరిస్సా జంక్షన్ దగ్గర ఆర్టీసీ స్కూల్ బస్సును కారు ఢీ కొట్టిన సంఘటన నేషనల్ హైవే 44 పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తకోట మండలం అమడబాకుల గ్రామంలోని మోడల్ స్కూల్లో చదివే విద్యార్థిని విద్యార్థులను ఎక్కించుకొని మదర్ తెరిసా జంక్షన్ దగ్గర కొత్తకోటలోకి మలుతున్న క్రమంలో హైదరాబాదు నుండి కర్నూలు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బస్సును ఢీకొనడంతో బస్సు డోర్, కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యిందని తెలిపారు. బస్సులోని విద్యార్థులకు ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని కారులో ప్రయాణిస్తున్న కారుడ్రైవర్ కు మరో ఇద్దరికి గాయాలు అయ్యాయని చెప్పారు. వేగంగా వచ్చి స్కూల్ బస్సును ఢీకొన్న కారు డ్రైవర్ పై కేసు నమోదు చేయాలని ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మంజునాథ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## కమలానగర్‌లో 31 అడవుల గణేశుడికి ఘనంగా పూజలు

దిల్ సుఖ్ నగర్, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) దిల్ సుక్ నగర్ లోని కమలానగర్ లో నెలకొల్పిన 31 అడుగుల గణనాథుడికి అసోసియేషన్ ఆధ్వర్యంలో తులసి శ్రీనివాస పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రవి చారి, సందీప్, పద్మనాభం, శ్రీపాదమ, సుప్రియ, నవ్య, అభిరా మ్ తేజ్, లోకేష్, అరహ్య తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో యువకుడి మృతి



గద్వాల, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కేటీదొడ్డి మండలం పాతపాలెం గ్రామానికి చెందిన షరీఫ్(26) గద్వాల పట్టణం రాయల్ లాడ్జి ఎదురుగా బేకరిషాప్ నిర్వాహిస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా శు క్రవారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటు రాగ గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు.

## పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కె యస్ యోగెందర్



గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గా గద్వాల జిల్లా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ధరూర్, ధరూర్ (మండలం) ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం గా పనిచేస్తున్న కె యస్ యోగేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్ల పాటి ఉమాకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారా యణ ఉత్తర్వులు జారీచేశారు. కె యస్ యోగెందర్ నియామకం పట్ల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి సాతర్ల రఘు, గౌరవ అధ్యక్షుడు భరత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సందర్భంగా యోగెందర్ మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కేవలం తెలంగాణ పి ఆర్ టి యు తోనే సాధ్యం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తమ సంఘం ముందు ఉంటుందన్నారు.



బదిలీపై వెళ్తున్న ఎస్సై సాగర్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

## ఏఎస్ఐ సాగర్ విధి నిర్వహణలో మార్గదర్శకులు: సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి

కొత్తకోట, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) కొత్తకోట పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా పని చేసిన సాగర్ భూత్పూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ పై వెళ్తున్న సందర్భంగా సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. సందర్భంగా సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ఏఎస్ఐ సాగర్ విధి నిర్వహణలో ఎంతో బాధ్యతాయుతంగా పనిచేశారని తోటి సిబ్బందికి మార్గదర్శకంగా ముందుకు ఏఎస్ఐ సాగర్ ను సన్మానించిన వారిలో కొత్తకోట మండలమాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, కోఆప్షన్ సభ్యులు అద్వాని శీను, ప్రేమ దానం, రహీం, ప్రభాకర్ రెడ్డి, రామచంద్ర యాదవ్, కృపాకర్ రెడ్డి, కొల్లంపల్లి, జమ్ములన్న, సురేందర్ తదితరులు ఉన్నారు.



## పాపిరెడ్డి నగర్‌లోని పలు వినాయక మండపాలలో పూజలు నిర్వహించిన చంద్రారెడ్డి

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని గణనాదుల మండపాలలో పూజలందుకుంటున్న విగ్నేశ్వరుని సేవలు ఊట్ల చంద్రారెడ్డి పాలుపంచుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాధుని ఆశీస్సు లతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అభివృద్ధి పదంలో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా వివిధ మండపాల నిర్వాహకులు చంద్రా రెడ్డిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదా లను అందజేశారు. అనంతరం మండపాల వద్ద జరుగుతున్న అన్నదాన కార్యక్రమాలను చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్. భగవంత రెడ్డి ,నరసింహులు ముదిరాజ్ , గడ్డం రాజేశ్వర్ రెడ్డి, అనంత రాములు. మారేళ్ల శ్రీనివాస్, ఆడేపు ప్రభాకర్, డి రామ్ రెడ్డి సాంబశివుడు.వనం అంజనేయులు, చంద్రయ్య, దామోదర్ రెడ్డి శరత్ రెడ్డి మహిపాల్ రెడ్డి మహేందర్ రెడ్డి. వెంకట్ రెడ్డి. మహేష్. చారి. కనక రెడ్డి , డి .తిరుపతిరెడ్డి ,మల్లికార్జున్, సుదర్శన్ , బాల నరసింహ, రాజేందర్, లక్ష్మారెడ్డి, ఎస్ యాదగిరి మేస్త్రి, శ్రీకాంత్ రెడ్డి శంకర్ రెడ్డి లక్ష్మక్క , మనమ్మ, ప్రభావతి , సులోచన, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల ప్రియదర్శిని మహిళ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. కలందర్ బాష ..




ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినిలు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణంలోని ప్రియదర్శిని మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినియర్ విద్యార్థులు జూనియర్స్‌కు ఆటపాటలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. కలందర్ బాష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చదువుతోనే మంచి భవిష్యత్ ఉందన్నారు. కళాశాల ప్రశాంత వాతావరణంలో విశాలమైన తరగతులతో ఆధునిక వసతులతో ఉత్తమమైన అధ్యాపకులతో ఉందని విద్యార్థినులు ప్రతి ఒక్కరు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రయత్నంచాలని, తమ భవిష్యత్తుకు ఉత్తమ బాటలు వేసుకొని తాము కోరుకున్న లక్ష్యాలను సాధించేందుకు ప్రయత్నించాలని సూచించారు. అనంతరం కళాశాలకు సంబంధించిన వివిధ గ్రూపుల విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో అధ్యాపకులు, బోధ నేత సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.



## పంచాయతీ బోర్డులపై ఓటర్ల జాబితా ప్రదర్శన

కేటిదొడ్డి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) మండలంలోని కొండాపురం, వెంకటాపురం, ఇర్కిచేడు, పాగుంటా, పాతపాలెం, గువ్వలదిన్నె గ్రామాల తో సహా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డ్ పై ఆ గ్రామ ఓటర్ల జాబితాను శుక్రవారం ప్రదర్శించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ గ్రామంలోని అన్ని వార్డుల్లో ఉన్న ఓటర్ల జాబితాను శుక్రవారం ఆ పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డుపై అంటించామని ఎంపిడిఓ కృష్ణమోహన్, ఆయా గ్రామాల కార్యదర్శిలు తెలిపారు. ఓటర్లు ఆ జాబితాలో ఉన్న పేర్లను వివరాలను సరిచూసుకోవాలని వారు సూచించారు.ఓటర్ జాబితాలో ఎవరైనా తప్పులు ఒప్పులు గాని, మార్పులు చేర్పులు ఉంటే ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి కి లిఖితపూర్వకంగా రాసివ్వాలని సూచించారు. చివరి ఓటర్ల జాబితా ఈనెల 28 న ప్రదర్శించడం జరుగుతుందని అన్నారు.



## జూరాల ప్రాజెక్టుపై మొసలి కలకలం

గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్13(ప్రభాత ఉదయం) ఎగువ కురుస్తున్న వర్షాలకు జూరాల ప్రాజెక్ట్‌కు జలకళ సంతరించుకుంది. అంతేకాకుండా మొసళ్లు ఎక్కువగా వచ్చి చేరుతున్నాయి. శుక్రవారం ఉదయం కృష్ణా నది నుంచి ఓ మొసలి ఒడ్డుకు చేరుకుని ప్రాజెక్టు సమీపంలోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ ముందు ఉన్న జూరాల ప్రాజెక్టు రోడ్డుపై తిరుగుతుండటంతో గమనించిన మత్స్య కారులు గంటపాటు శ్రమించి మొసలిని జూరాల ప్రాజెక్టులోకి పంపించారు.



## పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆర్టీసి బస్సులు నిలపాలని విద్యార్థుల ఆందోళన

### పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం)గోనుపాడు గ్రామంలో ఆర్టీసి బస్సులు ఆపాలని శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబివిపీ నాయకులు మాట్లాడుతూ గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆర్టీసి బస్సులు ఆపకపోవడంతో విద్యార్థిని విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళ్లలో విద్యార్థీనీలు బస్సుల కోసం రోడ్ల మీద నిలిచిఉ ండటంతో ఆకతాయిల వేధింపులు ఎదుర్కొవలసివస్తుందని, దీంతో విద్యార్థినిలు కళాశాల నుండి గద్వాల పట్టణానికి నడుచుకుంటూ వస్తున్నారని వెల్లడించారు. గతంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళలో గద్వాల డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసి బస్సులు నడిపించి, వెంటనే రద్దు చేశారని, ఈ విషయం డిపో మేనేజర్ కు వినతి పత్రాలు ఇచ్చిన స్పందించలేదని ఆరోపించారు. ఇప్పటికైన కావున అధికారులు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉదయం , సాయంత్రం వేళలో పాలిటెక్నిక్ కళాశాళ వద్ద ఉదయం, సాయంత్ర వేళలో ఆర్టీసి బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గద్వాల ఆర్టీసి డిపో సీఐకి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిపో సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి జిల్లా కన్వీనర్ గణేష్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్. జిల్లా నాయకులు నరేష్, వీరశేఖర్, నరేష్, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## సెప్టెంబర్ 23న జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర సెమినార్ విజయవంతం చేయండి: రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి చంద్రయ్య

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం) ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు సెప్టెంబర్ 23 , 24 తేదీలలో శంషాబాద్ లో జరుగుతున్నాయి. సెప్టెంబర్ 23న తుక్కుగూడలో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర సెమినార్ ను కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి చంద్రయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఏ ఆర్ దేవరాజు భవన్ లో జరిగిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన ఆర్థిక విధానం ప్రజల కోసమా లేదా లాభాల కోసం మానే అంశం పైన ఏఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సెమినార్ తుక్కుగూడలో ఏర్పాటు చేస్తున్నట్లు దీనికి ముఖ్య వక్త ప్రొఫెసర్ కె నాగేశ్వర్ వస్తున్నారని ఆయన తెలిపారు. సంస్థల పైన సమాజం పైన మంచి అవగాహన కలిగిన ప్రొఫెసర్ నాగేశ్వర్ ఈ అంశం పైన అనార్కలంగా మాట్లాడు తారని ఆయన తెలిపారు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరగడం చాలా సంతోషమని ఈ సమావేశాలను జిల్లాలో విజయవంతం చేయడానికి ఏఐటీయూసీ నాయకులు కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని గోడ రాతలు పత్రిక ప్రకటనలు విరివిగా ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు జిల్లాలో రాబోయే కాలంలో ఏఐటియుసిని అభివృద్ధి చేయడానికి ఈ కౌన్సిల్ సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దత్తు నాయక్, కే చంద్ యాదవ్, వనంపల్లి జైపాల్ రెడ్డి ,ఎస్ మల్లేష్ ,వడ్ల సత్యనారాయణ ,జిల్లా ఉపాధ్యక్షులు టి నరసింహారెడ్డి ,హరి సింగ్ నాయక్ ,ఆర్టీసీ వెంకన్న ,దాసరి ప్రసాద్, సక్రు నాయక్, మద్దిలేటి, రాములు గౌడ్, శ్రావణ్ కుమార్, కేతరాజు నరసింహ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించిన కార్పొరేటర్ సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం) ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వివిధ వినాయక మండపాలను స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.





## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

### బిఆర్ఎస్ పార్టీ సమావేశానికి బయలుదేరుతున్న మమ్మల్ని అరెస్టు చేయడం దారుణం

### గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం) ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుండా బిఆర్ఎస్ పార్టీ సమావేశానికి బయలుదేరుతున్న మమ్మల్ని అరెస్టు చేయడం దారుణమని గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు అన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ నివాసంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం శేరిలింగంపల్లి నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి గొట్టిముక్కల పెద్ద భాస్కకర్ రావు ఆధ్వర్యంలో బయలుదేరిన కార్యకర్తలను పోలీసులు మధ్యలోనే అడ్డగించి అరెస్టు చేసి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పెద్ద భాస్కర్ రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీ లను, కార్పొరేటర్ లను, కార్యకర్తలను కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు అరెస్టులను చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఇంట్లో నుంచి బయటికి రాకుండా హౌస్ అరెస్ట్ చేయడం చాలా దారుణమని అన్నారు. శేర్లింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ స్వయంగా మీడియాతో మాట్లాడుతూ మీటింగుకు రావచ్చు కుర్చీలు వేసాను, బ్రేక్ఫాస్ట్ అరేంజ్ చేశాను అని ఆయన నోటితోనే చెప్పి పోలీసులతో ఇలా అరెస్టు చేపియడం ఎంతవరకు న్యాయమని అన్నారు. ఎమ్మెల్యే ని ఒకటే ప్రశ్నిస్తున్నాం మీరు ఏ పార్టీలో ఉన్నారో స్పష్టంగా చెప్పండి ఒకవేళ బిఆర్ఎస్ లో ఉంటే పార్టీ కండువా కప్పుకోవాలి అని అడగడం తప్ప, దానికి సమాధానం చెప్పకుండా గుండాలను పెట్టి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి పై దాడి చేయడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసుల రాజ్యం నడుస్తోందని ఆరోపిస్తోంది. అన్నింటినీ ప్రజలు గమని స్తున్నారని సరైన టైంలో బుద్ధి చెప్తారని అన్నారు. వరికుప్పుల వాసు, యశ్వంత్ అఖిల్, శీను, జై శివరావ్, వెంకటేశ్వరరావు తదితరులు అరెస్ట్ అయ్యారు.

## ఉప్పేర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు

ధరూర్ , సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం)రేవులపల్లి సెక్టార్ లోని ఉప్పేరు గ్రామ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఉప్పేర్ అంగన్ వాడీ టీచర్లు ఇందిరమ్మ, గాయత్రి, కృష్ణవేణి ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవం సందర్భంగా బాలింతలకు, గర్భిణిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఎదుగుదల కోసం ప్రభుత్వం కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందని, అయినప్పటికి క్షేత్రస్థాయిలో రక్తహీనత, బరువు లోపాలు బయటపడుతూనే ఉన్నాయన్నారు.వీటికి చెక్‌పెట్టి, పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా,శిశు సంక్షేమ శాఖ సెప్టెంబరు నెలను పోషణ మాసోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు.గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలుగుతారని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, 3నుంచి 6ఏండ్ల లోపు చిన్నారులు తప్పక పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.